క్లుప్తంగా

అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు



వీపనగండ్ల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పూర్వప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి తక్కువ బరువు ఉన్నవారిని గుర్తించామని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించినట్లు ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా హరీష్ తెలిపారు. తక్కువ బరువు ఉన్నవారికి డబుల్ రేషన్‌తో పాటు పౌష్టికాహారం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు ఉమ, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయ్, ఎల్లమ్మ, హెల్పర్లు నిరంజన్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మత్స్య సహకార సంఘం ఎన్నికలు



వీపనగండ్ల: మత్స్య సహకార పారిశ్రామిక సంఘానికి గురువారం మండల కేంద్రంలో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సంఘానికి ఇద్దరు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎంపిక కాగా మరో 7 డైరెక్టర్ల కోసం 8 మంది పోటీ పడగా బ్యాలెట్ పద్ధతిలో ఏడుగురిని ఎన్నుకున్నారు. వీపనగండ్ల, కల్వరాల, గోపల్‌దిన్నె గ్రామాలకు చెందిన మొత్తం 250 మంది మత్స్య సహకారం సంఘం సభ్యులకు గాను 234 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కల్వరాల గ్రామానికి చెందిన బుడ్డమ్మ, గంగమ్మ ఏకగ్రీవంగా డైరెక్టర్లుగా ఎంపిక కాగా వెంకటయ్య, సాయిబాబా, సంగెం వెంకటస్వామి, ఈదన్న, అనుకలి నర్సింహ వీపనగండ్ల నుంచి డైరెక్టర్లు ఎంపికయ్యారు. గోపల్‌దిన్నె నుంచి కురుమయ్య, మౌలాలి ఎంపిక కాగా కల్వరాల నుంచి ఎన్నికల బరిలో ఉన్న గోపాల్ ఓటమి చెందారు. ఈ ఎన్నికలకు జిల్లా అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాసులు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ఆలయ భూముల కౌలు వేలం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పెద్ద దిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయ భూములను నెల 10వ తేదీన ఉదయం 12 గంటలకు రెండేళ్లకు గాను బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త జయసింహయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి సంబంధించిన మొత్తం 36 సర్వే నెంబర్లలోని వ్యవసాయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తారని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన రైతులు సర్వే నెంబర్ ఒక్కింటికి రూ.1000 చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వేలం ముగిసిన అనంతరం డిపాజిట్ పోను మిగిలిన 50శాతం నగదును ఆలయంలో చెల్లించి తమ బుకింగ్ రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు. మిగిలిన సొమ్మును జులై 21లోపు చెల్లించి తమ కౌలు రశీదు పత్రం పొందాలని ఆయన పేర్కొన్నారు.

ఇటిక్యాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల విద్యాధికారి కార్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండల విద్యాధికారి రాజు ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నూతన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.



పాన్‌గల్ మండలంలోని తెల్లరాళ్లపల్లిలో బడిబాట ర్యాలీ



దావాజిపల్లిలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య



బలిజపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని, ప్రైవేటుకు ధీటుగా విద్యా బోధన సాగుతుందని ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీఆర్పీ సౌమ్యరాణి అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో బడిబయటి విద్యార్థుల వివరాలను నమోదును ముమ్మరంగా చేపట్టారు.

కొత్తకోట రూరల్: బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయురాలు మంజులత తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దమందడి మండలంలోని బలిజపల్లిలో బడి బయట పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

పాన్‌గల్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నందున తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తల్లిదండ్రులను కోరారు. గురువారం మండలంలోని దావాజిపల్లి, దావాజిపల్లితండా గ్రామాల్లో నిర్వహించిన బడి బాట కార్యక్రమానికి ఆయన హాజరై ఇంటింటికీ తిరుగుతూ బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బద్రూనాయక్, మాజీ సర్పంచ్ వెంకటయ్యయాదవ్, సీఆర్పీలు గోవింద్, రమాదేవి, ఐఆర్పీ సంతోష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని ఎంపీడీఓ రవీందర్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని రంగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి తిరుగుతూ బడిబయట పిల్లలను బడిలో చేరించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

వీపనగండ్ల: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పిండం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించడంతోపాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, హెచ్‌ఎం నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు కృష్ణ, స్వప్న, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లతో పాటుగా పలుశాఖల అధికారులతో ఎంపీడీఓ వెంకటాచారి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓ ఉషారాణితో పాటు ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.



రంగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో..



వీపనగండ్లలో..



తిప్పడంపల్లిలో..

'ఆర్‌ఎస్పీని విమర్శించే నైతికత కాంగ్రెస్‌కు లేదు'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నంబావి: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విమర్శించే నైతికత కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీటీసీ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికలల్లో గెలుపు ఓటములు సహజమని కాంగ్రెస్ నాయకులు కక్ష సాధింపు రాజకీయాలు చేస్తూ హత్యలకు పూనుకుంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్‌రెడ్డిని హత్య చేసిన నిందితులను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు బహిరంగంగా తిరుగుతున్నారని ప్రశ్నించారే తప్ప ఎవరిని వ్యక్తిగతంగా విమర్శించలేదన్నారు. కానీ మండల కాంగ్రెస్ నాయకులు దానికే ఎందుకు ఉలికి పడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో హత్య రాజకీయాలు చేసిన ఘనత మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడికే చెందుతుందని, ఇప్పుడు సుద్దపూస మాదిరిగా మట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మండల సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ హత్య జరిగి రెండు వారాలు గడిచినా నిందితులను గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జయగౌడ్, చిన్నమారు మధు, డేగ శేఖర్, తగరం కురుమయ్య, ప్రకాష్ పరమాళ్ల, శివుడు, రామస్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు అవసరమయ్యే వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సింగిల్ విండో కార్యాలయం సీఈఓ భాస్కర్‌గౌడ్ గురువారం తెలిపారు. కార్యాలయంలో వరి బీపీటీ 25 కేజీల బస్తా ధర రూ.1,083, వరి ఆర్‌ఎన్‌ఆర్ రకం 25 కేజీల బస్తా ధర రూ. 1,094 అని తెలిపారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు వ్యవసాయ అధికారుల వద్ద ధృవీకరణ పత్రం తీసుకొని విత్తనాలు పొందవచ్చని సూచించారు.

'డీకే అరుణకు కేంద్రమంత్రి పదవి ఖాయం'

ఆత్మకూర్: మహబూబ్‌నగర్ మొట్టమొదటి మహిళా ఎంపీగా గెలుపొంది రికార్డు సృష్టించిన డీకే అరుణమ్మకు కేంద్రమంత్రి పదవి ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం నాయకులతో కలిసి ఢిల్లీకి వెళ్తున్న సందర్భంగా డీకే అరుణకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలున్న ఓటర్లకు ప్రలోభాలకు గురి చేసినా.. ఓటర్లు తమ అభ్యర్థి డీకే అరుణకు అండగా నిలిచారన్నారు. కేంద్రంలో మూడోసారి కొలువుదీరనున్న ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో అరుణమ్మకు మంత్రి పదవి ఇచ్చేందుకు ఢిల్లీ పెద్దలు ఇదివరకే సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో పుర ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, జిల్లాకార్యదర్శి అశోక్‌జీ, అనిల్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆనంద్, బాలకృష్ణ, శివశంకర్, తమ్మలి విజయ్, రాజు, ఎల్లన్న, మహేందర్‌రెడ్డి, భీంరెడ్డి, చందు, శంకర్,లక్ష్మీనారాయణ, సద్దలవెంకట్, శ్యాం, సూరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతరానికి ఆదర్శంగా ఉండాలి



ఆత్మీయ సమ్మేళనంలో గురుకుల పూర్వ విద్యార్థులు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పూర్వపు విద్యార్థులు రాబోయే యువతరానికి ఆదర్శంగా ఉండాలని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గత ప్రిన్సిపాల్ దేవానందం అన్నారు. గురువారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి గురుకుల పాఠశాలలో 2004కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా తమ మిత్రుడు కీ.శే. డాక్టర్ మహేష్ /జ్ఞాపకార్థం పాఠశాలకు అవసరమైన ఫ్రిజ్, ప్రొజెక్టర్, ఇన్వర్టర్‌లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ఇన్వర్టర్, నేటి తరానికి అవసరమైన కంప్యూటర్ విద్యకోసం ప్రొజెక్టర్, విద్యార్థులకు అవసరమైన మెడికల్ సదుపాయం కోసం ఫ్రిజ్‌ను అందించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

పాన్‌గల్: క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించాలని, ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకునేలా చూడాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలపై అవగాహన కల్పిస్తూ వైద్యుల సూచనలను పాటించేలా చూడాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజలను చైతన్యం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు నాగరాజు, మైథిలి, సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న అధికారులు

పాన్‌గల్: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన పెంచి, ఎక్కువ మంది రైతులు పండ్ల తోటలు నాటుకునేలా చూడాలని ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండ్ల తోటలకు మంజూరైన రైతుల పొలాల్లో గుంతల తవ్వకం పనులను, ఫాంపాండ్ల ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పాటు గ్రామాలకు నిర్దేశించిన మేరకు హరితహారం మొక్కలకు అనుగుణంగా గుంతల తవ్వాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



చువ్వలు తేలిన స్తంభం

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామంలోని రైతు నిత్యానందారెడ్డి వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం సీకులు తేలి ప్రమాదకరంగా మారింది. వ్యవసాయ పొలంలో ప్రమాదకరంగా ఉన్న స్తంభం గుండా 11 కేవీ విద్యుత్ లైన్ సరఫరా ఉంది. వర్షాకాలం కావడంతో గాలులు వీస్తున్న తరుణంలో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఆందోళనగా ఉందని రైతు పేర్కొన్నాడు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం గురించి విద్యుత్ అధికారులకు విన్నవించామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం చోటుచేసుకోకముందే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని రైతు కోరుతున్నాడు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఆత్మకూర్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు



మోజర్లలో..

ఆత్మకూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్, ఆర్‌ఐ జయమ్మ, హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు అన్నారు. గురువారం ఆత్మకూర్‌లోని ఎరువుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ టీం అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. లావాదేవీల వివరాలు నమోదు చేసుకున్నారు. విత్తనాలు కొనుగోలు చేసుకున్న రైతులకు తప్పని సరిగా రశీదులను ఇవ్వాలని ఆదేశించారు. రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకూడదని అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయాధికారులు నిత్యం అందుబాటులో ఉంటారని తెలిపారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలో గల ఫర్టిలైజర్ షాపుల యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి సైదులు, హెడ్ కానిస్టేబుల్ శాంతయ్య హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో విత్తనాల పాకెట్లను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏఓ సైదులు మాట్లాడుతూ విత్తనాలు తీసుకున్న రైతులు వెంటనే రసీదు తీసుకోవాలని, ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ షాపుల్లోనే కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆస్పత్రికి మంచం వితరణ



ఆత్మకూర్: తిప్పుడంపల్లి ప్రభుత్వ పీహెచ్‌సీ ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం రేచింతల మాజీ సర్పంచ్ దివంగత మురళీధర్‌రావు స్మారకార్థం రూ.28వేలు విలువ చేసే మంచాన్ని అందజేసినట్లు లక్ష్మణ్‌రావు తెలిపారు. గురువారం వైద్యాధికారి డాక్టర్ శరత్‌కుమార్ మాట్లాడుతూ రోగుల సౌకర్యార్థం దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావును వైద్య సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సురేష్ కుమార్, సురేందర్‌గౌడ్, రామకృష్ణ, సురేష్, రేచింతల గ్రామస్తులు ఉన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

వనపర్తి టౌన్: అమావాస్య సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని చింతల హనుమాన్ ఆలయంలో ఆంజనేయ మాలధారణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి పల్లకీసేవతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆకుపూజలు, అభిషేకం, అర్చన నిర్వహించడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. అనంతరం మాలధారణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. వనపర్తి మర్రికుంట ఆంజనేయ స్వామి ఆలయంలోనూ అమావాస్య సందర్భంగా అన్నదానం చేశారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి సమీపంలోని తిరుమలయ్య గుట్ట వద్ద గల ఆంజనేయస్వామికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి తిరుమలయ్య గుట్టపై గల వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా ఆలయానికి చేరుకుని పూజలు చేసినట్టు, వర్షాలు బాగా కురవాలని, పంటలు మంచిగా పండి రైతులందరూ సంతోషంగా ఉండాలని పూజలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం గ్రామస్తులు విష్ణువర్ధన్‌రెడ్డి, సునీత దంపతులు భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు.

ఆదిబసవేశ్వర ఆలయంలో..

శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఆదిబసవేశ్వర స్వామి ఆలయంలోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు చేశారు. ఆలయానికి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన ప్రత్యూష, రమేష్ గౌడ్ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణ, అధ్యక్షులు ఆంజనేయులు, రవియాదవ్, గంగాధర్, సతీష్, క్రాంతి, రాముడు, మల్లేష్, శివ, లక్ష్మణ్, సురేష్, రంగస్వామి, మహేష్, రాజు, వెంకటేష్ ఉన్నారు.



తిరుమలగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రధాన ఆలయాల్లో అమావాస్యను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివచౌడేశ్వరి ఆలయంతో పాటు వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం చేశారు. నాగల్‌కడ్మూర్‌లోని దేవేంద్రచార్యుల మఠంలో పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. చంద్రగఢ్ కోటలోని శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద గురువారం అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న ఆలయంలో స్వామి వారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కిందిభాగాన భక్తులకు అన్నదానం చేశారు.



శ్రీరంగాపురంలోని బసవేశ్వరస్వామి ఆలయంలో..



ఖిల్లాఘనపురం వీరభద్ర స్వామి దేవాలయం వద్ద..



అమరచింతలోని శివచౌడేశ్వరి ఆలయంలో..



వనపర్తి చింతల హనుమాన్ ఆలయంలో..

ఆయిల్‌పాం సాగుపై రైతుల ఆసక్తి



యాపట్లలో రైతు సాగుచేసిన ఆయిల్‌పాం తోట

పెద్దకొత్తపల్లి: మండలంలోని రైతులు సాంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలికి వాణిజ్య పంటల వైపు అడుగులు వేస్తున్నారు. మండలంలో ఆయిల్‌పాం తోటల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలో 300 ఎకరాలలో ఆయిల్ పాం సాగు చేపట్టారు. కొత్తగా సాగు చేపడుతున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై మొక్కలు అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభ్యున్నతి సాధించాలని వ్యవసాయాధికారులు అవగహన కల్పిస్తున్నారు.